## ఆనాడు సంతాపం తెలపాలన్న సోయి లేదా?

- మాజీ రాష్ట్రపతికి ఆ మాత్రం గౌరవం ఇవ్వలేదెందుకు?
- కాంగ్రెస్ అధిష్ఠానంపై ప్రణబ్ ముఖర్జీ కుమార్తె ఆగ్రహం



న్యూఢిల్లీ, డిసెంబర్ 28: మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు విడిగా స్మారకాన్ని నిర్మించాలని కోరుతూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి ప్రతిపాదన పంపడాన్ని మాజీ రాష్ట్రపతి ప్రణాబ్ ముఖర్జీ కుమార్తె శర్మిష్ఠా ముఖర్జీ విమర్శించారు. 2020 ఆగస్టులో తన తండ్రి మరణించినపుడు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో సంతాప సమావేశాన్ని నిర్వహించాలన్న ఆలోచన కూడా కాంగ్రెస్ నాయకత్వానికి లేకుండా పోయిందని శనివారం ఒక ఎక్స్ పోస్ట్‌లో ఆమె మండిపడ్డారు. ఆ సమయంలో కాంగ్రెస్ నాయకత్వం తనను తప్పుదారి పట్టించిందన్నారు. భారత రాష్ట్రపతులకు సంతాప సమావేశాలు నిర్వహించే అలవాటు పార్టీకి లేదని కాంగ్రెస్‌కు చెందిన సీనియర్ నాయకుడు ఒకరు తనతో అన్నారని ఆమె చెప్పారు. మాజీ రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ మృతి చెందినపుడు సీడబ్ల్యూసీ సమావేశాన్ని ఏర్పాటు చేసి తన తండ్రే స్వయంగా సంతాప సందేశాన్ని రాసినట్టు తన తండ్రి డైరీల ద్వారా తనకు తెలిసిందని ఆమె వెల్లడించారు. గాంధీ కుటుంబ సభ్యులు కానందువల్లే పార్టీకి చెందిన రాజనీతిజ్ఞులను సైతం పార్టీ ఎలా అగౌరపరిచిందో బీజేపీ నేత సీఆర్ కేశవన్ రాసిన ఓ పోస్టును శర్మిష్ఠ ప్రస్తావించారు.మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు ఢిల్లీలో స్మారకాన్ని కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ ప్రభుత్వం నిర్మించలేదని శర్మిష్ఠా ముఖర్జీని సందర్భంగా గుర్తు చేశారు.

## పూర్తిగా అవమానకరం

- మన్మోహన్ అంత్యక్రియల తీరుపై రాహుల్ ఆగ్రహం
- గత సంప్రదాయాన్ని కొనసాగించాలన్న అఖిలేశ్

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు ఢిల్లీలోని నిగంబోధ్ ఘాట్‌లో శనివారం అంత్యక్రియలు నిర్వహించడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా విరుచుకుపడ్డారు. గతంలో అంత్యక్రియలకు ఇతరులకు ప్రత్యేక స్మశాన స్థలాలను ఇచ్చిన విషయాలను ఆయన ఉటంకిస్తూ.. ఇది మాజీ ప్రధాని, సిక్కు జాతిని పూర్తిగా అవమానపర్చడమేనని కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. మన్మోహన్ అంత్యక్రియల విషయంలో రాజకీయాలకు, సంకుచిత భావాలకు అతీతంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించ లేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ విమర్శించారు. ఈ సందర్భంగా 2016లో మాజీ ప్రధాని వాజపేయి అంత్యక్రియల నాటి ఫుటేజ్‌ను షేర్ చేస్తూ మన్మోహన్ సింగ్ విషయంలో కేంద్రం వైఖరిని తప్పుబట్టారు.

**స్మారకంపై రాజకీయాలు వద్దు**

మన్మోహన్ అంత్యక్రియలు, స్మారక నిర్మాణ విషయంలో మోదీ ప్రభుత్వ వైఖరిని సమాజ్‌వాదీ పార్టీ, బీఎస్పీ, ఆప్ తీవ్రంగా ఖండించాయి. ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్ ఎక్స్ వేదికగా శుక్రవారం స్పందిస్తూ దేశ మాజీ ప్రధాన మంత్రులను గౌరవించే సాంప్రదాయాన్ని కొనసాగించాలని ప్రధాని మోదీని కోరారు.

**పీవీ విషయాన్ని కాంగ్రెస్ మరిచిందా?**

బతికి ఉన్నప్పుడు ఎన్నడూ మన్మోహన్ సింగ్‌ను గౌరవించని కాంగ్రెస్ ఇప్పుడు ఆయన మరణాంతరం రాజకీయాలు చేస్తున్నదని బీజేపీ సీనియర్ నేత సుధాంశు త్రివేది విమర్శించారు. మాజీ ప్రధానులు లాల్ బహదూర్ శాస్త్రి, పీవీ నరసింహారావులు సహా గాంధీయేతర నేతలెవ్వరికీ కాంగ్రెస్ గౌరవాన్ని ఇవ్వలేదని ఆరోపించారు. బీజేపీ నేత సీఆర్ కేశవన్ మాట్లాడుతూ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కు ఢిల్లీలో అంత్యక్రియలు జరపకుండా కాంగ్రెస్ అడ్డుకున్న విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ దీనిపై సమాధానం చెప్పాలన్నారు.

# ఆదర్శ నేత.. అమర్ రహే

- మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు భారత్ తుది వీడ్కోలు
- అధికారిక లాంఛనాలతో ఢిల్లీలో ముగిసిన అంత్యక్రియలు
- రాష్ట్రపతి, ప్రధాని, భూటాన్ రాజు సహా ప్రముఖుల హాజరు

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: మాజీ ప్రధాన మంత్రి, ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ ఆదర్శ ప్రస్థానం ముగిసింది. ఢిల్లీలోని నిగమ్‌బోధ్ ఘాట్‌లో శనివారం ఆయన అంత్యక్రియలు జరిగాయి. కేంద్రం అధికార లాంఛనాలతో ఆయనకు తుది వీడ్కోలు పలికింది. మన్మోహన్ పెద్ద కూతురు ఉపిందర్ సింగ్ తన తండ్రికి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌కడ్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఆ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, భూటాన్ రాజు జిగ్మె ఖేసర్ నామ్‌గ్యల్ వాంగ్‌చుక్, మారిషస్ విదేశాంగ మంత్రి ధనంజయ్ రామ్‌ఫల్, త్రివిధ దళాధిపతులు తదితరులు మన్మోహన్ సింగ్ అంత్యక్రియల్లో పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. సిక్కు మతాచారం ప్రకారం జరిగిన అంత్యక్రియల్లో సాయుధ బలగాలు గాల్లోకి కాల్పులు జరిపి మాజీ ప్రధానికి గౌరవ వందనం సమర్పించాయి. అంతకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం నుంచి నిగమ్‌బోధ్ ఘాట్ వరకు 'మన్మోహన్ సింగ్ అమర్ రహే' నినాదాలతో హోరెత్తుతూ ఆయన అంతిమయాత్ర సాగింది. ఏఐసీసీ కార్యాలయంలో పలువురు కాంగ్రెస్ నేతలు ఆయనకు నివాళులర్పించారు. కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ముఖ్యమంత్రులు సిద్ధరామయ్య, రేవంత్ రెడ్డి, సుఖ్‌విందర్ సింగ్ సుఖు, ఆతిశీ తదితరులు అంత్యక్రియలకు హాజరయ్యారు.



నివాళులర్పిస్తున్న గురుశరణ్ కౌర్



ఢిల్లీలో మన్మోహన్ అంతిమ యాత్రకు హాజరైన అశేష జనవాహిని

**స్మారక నిర్మాణానికి నిర్ణయం**

మన్మోహన్ సింగ్‌కు ఢిల్లీలో స్మారకాన్ని నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనువైన స్థలాన్ని త్వరలోనే నిర్ణయిస్తామని పేర్కొన్నది. కాగా, స్మారక నిర్మాణం జరగనున్న స్థలంలోనే అంత్యక్రియలు జరపాలని అంతకుముందు కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. మన్మోహన్ అంత్యక్రియలు, స్మారకానికి స్థలాన్ని నిర్ణయించకుండా బీజేపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే దేశ తొలి సిక్కు ప్రధానమంత్రిని అవమానిస్తున్నదని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది.

**నిజమైన పెద్ద మనిషి: బైడెన్**

మన్మోహన్ సింగ్ మృతి పట్ల పలువురు దేశాధినేతలు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన సేవలను, ప్రతిభను కొనియాడారు. భారత్-అమెరికా సంబంధాలను బలోపేతం చేయడంలో మన్మోహన్ సింగ్ కీలక పాత్ర పోషించారని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ పేర్కొన్నారు. ఆయన నిజమైన పెద్ద మనిషి, వక్త అని వ్యాఖ్యానించారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ భారత దేశ ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దడంలో ప్రముఖ పాత్ర పోషించారని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. న్యూఢిల్లీలో పాలస్తీనా దౌత్య కార్యాలయం ఏర్పాటుకు మన్మోహన్ మద్దతుగా నిలిచారని పాలస్తీనా దౌత్యవేత్త అబెద్ ఎల్రజెగ్ అబు జజెర్ గుర్తు చేసుకున్నారు.

### భూటాన్‌లో ప్రార్థనలు.. మారిషస్ పతాకం అవనతం



మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు భూటాన్ ఘనంగా నివాళులర్పించింది. శుక్రవారం ఆ దేశ రాజధాని థింపులోని బౌద్ధ క్షేత్రంలో మన్మోహన్ ఆత్మ శాంతి కోసం జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నమ్‌జియెల్ వాంగ్‌చుక్ పాల్గొన్నారు. మరోవైపు మన్మోహన్ మృతికి సంతాప సూచకంగా శనివారం సూర్యాస్తమయం వరకు జాతీయ జెండాలను అవనతం చేయాలని మారిషస్ ప్రభుత్వం ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలను ఆదేశించింది.

## పీఎం కేర్స్ విరాళాల్లో క్షీణత

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: దేశంలో కోవిడ్-19 మహమ్మారి ప్రబలిన తర్వాత 2020 మార్చిలో స్థాపించిన ప్రైమ్ మినిస్టర్స్ సిటిజన్ అసిస్టెన్స్ అండ్ రిలీఫ్ ఇన్ ఎమర్జెన్సీ సిచువేషన్స్(పీఎం కేర్స్) ఫండ్‌కు విరాళాలు భారీగా తగ్గిపోయాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఈ నిధికి అందిన విరాళాలు కేవలం రూ.912 కోట్లు మాత్రమే. 2020-21లో రూ.7,184 కోట్ల విరాళాలు లభించగా 2021-22లో రూ.1,938 కోట్లు మాత్రమే లభించాయి. 2021 తర్వాత విదేశీ విరాళాలు కూడా క్రమంగా తగ్గుముఖం పట్టాయి. మరోవైపు ఈ ఫండ్ నుంచి 2022-23లో మొత్తం వ్యయం రూ.439 కోట్లుగా ఉంది. ఇందులో రూ.346 కోట్లను కొవిడ్ కాలంలో పీఎం కేర్స్ ఫర్ చిల్డ్రన్ నిధికి వినియోగించినట్టు అధికారులు చెప్పారు.

## రిలయన్స్ ఉపకార వేతనాల్లో తెలుగు విద్యార్థులకు పెద్ద పీట

**దేశ వ్యాప్తంగా 5 వేల మంది యూజీ స్కాలర్ల ఎంపిక**

న్యూఢిల్లీ: రిలయన్స్ ఫౌండేషన్ 2024-25 బ్యాచ్ అండర్ గ్రాడ్యుయేట్ స్కాలర్‌షిప్ లబ్ధిదారులను ప్రకటించింది. దేశవ్యాప్తంగా దాదాపు ఒక లక్ష మంది వీటికి దరఖాస్తు చేసుకోగా, 5 వేల మందిని ఎంపిక చేసినట్లు తెలిపింది. ఎంపికైనవారిలో ఒక్కొక్కరికి ట్యూషన్ ఫీజు, హాస్టల్, ఇతర విద్యా సంబంధిత ఖర్చుల కోసం రూ.2 లక్షల వరకు ఆర్థిక సాయం చేయనున్నట్లు తెలిపింది. 850 మంది విద్యార్థులతో ఏపీ మొదటి, 411 మందితో తెలంగాణ నాలుగో స్థానంలో నిలిచిందని వివరించింది. రిలయన్స్ ఫౌండేషన్ వెబ్‌సైట్ https://scholar ship s.relian cef oundation.org/UG Scho larship_ApplicationStatus .aspxను ద్వారా ఫలితాలను తెలుసుకోవచ్చని తెలిపింది.

## బీఎస్ఎన్ఎల్‌లో రెండో విడత వీఆర్ఎస్

**ఆర్థిక శాఖ అనుమతి కోరిన టెలికాం శాఖ**

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: ప్రభుత్వ టెలికాం రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్‌లో ఉద్యోగుల రెండో విడత స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్)కు రంగం సిద్ధమవుతున్నది. సంస్థలోని 35 శాతం సిబ్బందిని తగ్గించే లక్ష్యంతో చేపట్టే రెండో విడత వీఆర్ఎస్‌కు టెలి కమ్యూనికేషన్స్ శాఖ ఆర్థిక శాఖను అనుమతి కోరింది. ఈ మేరకు 15 వేల కోట్ల రూపాయలను కేటాయించాలని విజ్ఞప్తి చేసింది. ఈ పథకం ద్వారా ప్రస్తుతం 18 వేల నుంచి 19 వేల మంది ఉద్యోగులను సంస్థ నుంచి ఇంటికి పంపనుంది. వీఆర్ఎస్ కారణంగా భవిష్యత్తులో సంస్థపై ఆర్థిక భారం తగ్గడమే కాక, లాభదాయకత పెరుగుతుందని పేర్కొంది. ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ తన ఆదాయంలో 38 శాతమైన రూ.7,500 కోట్లను సిబ్బంది జీతాలకు వెచ్చిస్తున్నది. దీంతో కంపెనీ కార్యకలాపాలను క్రమబద్ధం చేసేందుకు ఈ ఖర్చును రూ.5,000 కోట్లకు తగ్గించాలని ప్రణాళిక వేస్తున్నది. రెండో విడత వీఆర్ఎస్‌కు ఆర్థిక శాఖ నుంచి అనుమతి వస్తే దానిని కేంద్ర మంత్రివర్గం ఆమోదానికి పంపాలని ఆ శాఖ యోచిస్తున్నది. కాగా, ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ ఇంకా 4జీ సేవలను దేశవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురాలేదు.

## అక్రమార్జనలో ఆరితేరిపోయాడు

**ఎంపీలో మాజీ కానిస్టేబుల్ ఆస్తుల్లో 14 కోట్ల నగదు, 40 కోట్ల విలువైన పసిడి**



భోపాల్, డిసెంబర్ 28: మధ్యప్రదేశ్ రవాణా శాఖకు చెందిన ఓ మాజీ కానిస్టేబుల్ నివాసాలలో సోదాలు జరిపిన వివిధ దర్యాప్తు సంస్థలకు దాదాపు రూ.14 కోట్ల నగదు, రూ.40 కోట్ల విలువైన బంగారం, రూ.2 కోట్ల విలువైన వెండి,రియల్ ఎస్టేట్ పెట్టుబడులకు సంబంధించిన అనేక పత్రాలు లభించాయి. మాజీ కానిస్టేబుల్ సౌరభ్ శర్మ ఇంటిపై గత వారం లోకాయుక్త మొదటిసారి దాడి జరపగా రూ. 2.87 కోట్ల నగదు, 275 గ్రాముల వెండితోసహా రూ.7.98 కోట్ల చరాస్తులు లభించాయి. ఆదాయ పన్ను శాఖ మరోసారి దాడి జరపగా రూ.40 కోట్ల విలువైన 52 కిలోల బంగారు బిస్కెట్లు, రూ.11 కోట్లకు పైగా నగదు భోపాల్‌లో ఒక నిర్జన ప్రదేశంలో వదిలివేసిన కారులో లభించాయి.

## కలెక్టర్ కూతురైతే ఇలాగే చేస్తారా?

**బోరు బావిలోని చిన్నారిపై తల్లి**

జైపూర్ (రాజస్థాన్): ''కలెక్టర్ మేడమ్ కుమార్తె అయితే ఇలాగే చేస్తారా? నా కూతురు ఆరు రోజులుగా గోతిలో అల్లాడిపోతోంది. ఇన్ని రోజులుగా ఇలాగే వదిలేస్తారా? దయచేసి వీలైనంత త్వరగా బయటకు తీయండి'' - రాజస్థాన్‌లో ఆరు రోజులుగా బోరుబావిలో చిక్కుకున్న మూడేళ్ల చిన్నారి చేతన తల్లి ధోలీదేవి ఆవేదన ఇది. కోట్‌పుత్లి-బెహ్రార్ జిల్లాకు చెందిన చేతన ఈ నెల 23న తండ్రి పొలంలోని 150 అడుగుల లోతైన బోరుబావిలో పడిపోయింది. 110 గంటలుగా చిన్నారిని రక్షించేందుకు సహాయక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అధికారులు పైపు ద్వారా ఆహారం, నీళ్లు అందిస్తున్నారు.

## అధిక వడ్డీ పేరుతో 6 వేల కోట్ల స్కామ్

**గుజరాత్‌లో నిందితుడి అరెస్ట్**

గాంధీనగర్: గుజరాత్‌లో బ్యాంకుల కంటే అధిక వడ్డీ ఇస్తామంటూ ఆశ చూపి, మోసం చేసిన భారీ కుంభకోణంలో ప్రధాన నిందితుడు భూపేంద్రసింగ్ ఝులాను పోలీసులు అరెస్ట్ చేశారు. బీజే ఫైనాన్షియల్ సర్వీసెస్, బీజే గ్రూప్ పేరుతో వేలాది మంది నుంచి రూ.6 వేల కోట్ల వరకు వసూలు చేసిన నిందితుడు నెల రోజుల నుంచి పరారీలో ఉండగా పక్కా సమాచారంతో సీఐడీ బృందాలు నిందితుడిని మెహ్సానా జిల్లా దావ్డాలోని ఫామ్ హౌజ్‌లో పట్టుకున్నారు. నిందితుడి నుంచి విలాసవంతమైన కార్లు, భారీగా నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలుస్తున్నది. మరోవైపు భూపేంద్రసింగ్ స్థానిక కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా న్యాయస్థానం తిరస్కరించింది.



## ఎత్తయిన 7 పర్వతాలు సవాల్‌గా ఎక్కేసి..

**ముంబై బాలిక ప్రపంచ రికార్డ్**

ముంబై, డిసెంబర్ 28: ముంబైకు చెందిన 16 ఏళ్ల కామ్యా కార్తికేయన్ పర్వతారోహణలో ప్రపంచ రికార్డును సాధించింది. ఏడు ఖండాల వ్యాప్తంగా ఏడు అత్యంత ఎత్తైన పర్వతాలను అధిరోహించిన అతి పిన్నవయస్కురాలైన బాలికగా కామ్య చరిత్ర సృష్టించింది. ఏడు పర్వతాలను అధిరోహించే సవాల్‌ను స్వీకరించిన కామ్య మౌంట్ కిలిమంజారో(ఆఫ్రికా), మౌంట్ ఎల్‌బ్రస్(యూరపు), మౌంట్ కాజీయాస్కో(ఆస్ట్రేలియా), మౌంట్ అకాన్‌కాగువా(దక్షిణ అమెరికా), మౌంట్ డెనలి(ఉత్తర అమెరికా), మౌంట్ ఎవరెస్ట్(ఆసియా), మౌంట్ విన్సన్(అంటార్కిటికా)లను విజయవంతంగా అధిరోహించింది. తన తండ్రి కమాండర్ కార్తికేయన్‌తో కలసి మౌంట్ విన్సన్ చేరుకున్న కామ్య డిసెంబర్ 24న సప్త పర్వాతాధిరోహణ సవాల్‌ను పూర్తి చేసింది. ముంబైలోని నేవీ చిల్డ్రన్ స్కూల్‌లో 12వ తరగతి చదువుతున్న కామ్య, ఆమె తండ్రి కమాండర్ కార్తికేయన్‌ను భారతీయ నేవీ అభినందించింది. ఉత్తర ధ్రువం, దక్షిణ ధ్రువం చేరుకోవడాన్ని తన తదుపరి లక్ష్యంగా కామ్య నిర్దేశించుకుంది.

# ఏఐతో మానవ మనుగడకు ముప్పు

**దాని అభివృద్ధిపై ప్రభుత్వ నియంత్రణ అవసరం.. ఏఐ గాడ్‌ఫాదర్ ప్రొఫెసర్ హింటన్ ఆందోళన**

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: రానున్న 30 ఏండ్లలో కృత్రిమ మేధ(ఏఐ) కారణంగా మానవ మనుగడకు ముప్పు ఏర్పడ వచ్చని ఏఐకి గాడ్ ఫాదర్‌గా పిలుచుకునే బ్రిటిష్-కెనడియన్ కంప్యూటర్ సైంటిస్టు ప్రొఫెసర్ జెఫ్రీ హింటన్ ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న మూడు దశాబ్దాలలో ఏఐ కారణంగా మానవ మనుగడకే ముప్పు ఏర్పడే అవకాశాలు 10 నుంచి 20 శాతం వరకు ఉన్నాయని ఈ ఏడాది భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమానం పొందిన హింటన్ తెలిపారు. బీబీసీ రేడియో 4కి చెందిన టుడే ఇంటర్వ్యూలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. గతంలో మానవ మనుగడకు ఏఐతో వచ్చే ముప్పును 10 శాతంగా అంచనా వేసిన హింటన్ ఇప్పుడు దాన్ని 20 శాతానికి పెంచడం గమనార్హం. ఏఐతో సంభవించే ముప్పు గురించి మీ అంచనాలో మార్పు ఏమైనా ఉందా అన్న ప్రశ్నకు హింటన్ సమాధానమిస్తూ అది 10 శాతం నుంచి 20 శాతానికి పెరిగిందని జవాబిచ్చారు. ఏఐతో తలెత్తే ముప్పు పెరిగే అవకాశం ఉందా అని ప్రశ్నించగా మన కన్నా ఎక్కువ మేధను మనం గతంలో ఎన్నడూ ఎదుర్కొనలేదని ఆయన చెప్పారు. ఏఐ వ్యవస్థలను ఆయన తల్లిగా, వాటిని నియంత్రించే మానవులను పిల్లలుగా ఆయన అభివర్ణించారు. నియంత్రణ లేని ఏఐ అభివృద్ధి వల్ల ఎదురయ్యే ప్రమాదాల గురించి స్వేచ్ఛగా మాట్లాడేందుకు 2023లో గూగుల్ సంస్థ నుంచి హింటన్ బయటకు రావడంతో ఈ టెక్నాలజీకి సంబంధించి ఆయన వ్యక్తం చేసిన ఆందోళనలు మొదటిసారి బహిర్గతమయ్యాయి. ఏఐ అభివృద్ధి శరవేగంగా జరుగుతుండడంపై స్పందిస్తూ ఈ స్థాయిలో ఈ రోజు ఇలా ఉంటుందని తాను ఊహించలేదన్నారు. మనుషుల కన్నా ఏఐ వ్యవస్థలు మరింత తెలివైనవిగా మారతాయన్న ఏఐ రంగ నిపుణుల అంచనాల పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐ రంగంలో జరుగుతున్న అభివృద్ధి తాను ఊహించిన దానికన్నా చాలా వేగంగా ఉందని, దీనిపై ప్రభుత్వ నియంత్రణ అత్యంత అవసరమని హింటన్ స్పష్టం చేశారు. బడా కంపెనీలు ఏఐ అభివృద్ధిలో జాగ్రత్తలను పట్టించుకోవని చెప్పారు. భద్రతకు సంబంధించి ప్రభుత్వ నియంత్రణే ముఖ్యమని అభిప్రాయపడ్డారు.



## రైతు నేతలు రైతు శ్రేయోభిలాషులు కాదు!

- డల్లేవాల్‌ను దవాఖానకు తరలించండి
- పంజాబ్ ప్రభుత్వానికి సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: డిమాండ్ల సాధనకు నెల రోజులుగా దీక్ష చేస్తున్న రైతు నేత జగ్జీత్ సింగ్ డల్లేవాల్‌ను ఇంకా దవాఖానకు తరలించకపోవడం పట్ల సుప్రీం కోర్టు శనివారం పంజాబ్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా తమ కోసం దీక్ష చేస్తున్న నేతకు వైద్య సహాయం అందకుండా చేస్తున్న రైతుల ఉద్దేశంపై కోర్టు అనుమానాన్ని వ్యక్తం చేసింది. అలాంటి వారు ఆయన శ్రేయోభిలాషులు కాదని వ్యాఖ్యానించింది. డల్లేవాల్ దీక్షపై శనివారంనాటి విచారణలో ఆయనను దవాఖానకు తరలించడానికి డిసెంబర్ 31 వరకు గడువు ఇస్తున్నట్టు సెలవు బెంచ్ జడ్జీలు సూర్యకాంత్, సుధాంశు ధులియా ఆదేశాలు జారీ చేశారు. అవసరమైతే కేంద్రం సహాయాన్ని తీసుకోవచ్చునని పేర్కొన్నారు. డల్లేవాల్‌ను దవాఖానకు తరలించడంపై పంజాబ్ ప్రభుత్వం నిస్సహాయత వ్యక్తం చేసింది. వైద్య చికిత్సకు నిరాకరిస్తున్నారని, ఆయన చుట్టూ రైతులు రక్షణగా ఉండటంతో దవాఖానకు తీసుకెళ్లలేకపోతున్నామని కోర్టుకు విన్నవించారు.

## జన గణన పనులు షురూ

న్యూఢిల్లీ: జనాభా లెక్కల సేకరణకు అత్యాధునిక జియో స్పాషియల్ టెక్నాలజీని కేంద్ర ప్రభుత్వం ఉపయోగించబోతున్నది. దీని కోసం వినూత్న చర్యలను చేపట్టినట్లు కేంద్ర హోం శాఖ శనివారం తెలిపింది. జనాభా లెక్కల సేకరణకు సన్నాహాల్లో భాగంగా మ్యాపింగ్ కార్యక్రమాలను చేపట్టినట్లు పేర్కొంది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, జిల్లాలు, మండలాలు/తాలూకాలు, గ్రామాలు, పట్టణాలు, వార్డులు వంటివాటి మ్యాపులను ఆధునికీకరించినట్లు వెల్లడించింది.

### మంచు గుప్పిట్లో కాశ్మీరం!



జమ్ము కశ్మీర్‌లో శనివారం భారీగా మంచు కురియడంతో విమానాలు, రైళ్లు, వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో జమ్ము-శ్రీనగర్ జాతీయ రహదారిని మూసివేశారు. శ్రీనగర్‌లో 8 అంగుళాల మంచు కురిసినట్లు అధికారులు తెలిపారు. దోడా, శ్రీనగర్, పుల్వామా, అనంత్‌నాగ్, సోనామార్గ్, బండిపొర ప్రాంతాలు మంచు దుప్పటి కప్పుకొని అందంగా కనిపిస్తున్నాయి. ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఇదే అత్యధిక హిమపాతం.



## చైనా సరిహద్దులో శివాజీ విగ్రహావిష్కరణ

న్యూఢిల్లీ: తూర్పు లడఖ్ సెక్టర్‌లోని వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ)కి సమీపంలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని భారత సైన్యం ఆవిష్కరించింది. పాంగాంగ్ సో సరస్సు తీరంలో, సముద్ర మట్టానికి 14,300 అడుగుల ఎత్తులో దీనిని ఏర్పాటు చేసింది. లెఫ్టినెంట్ జనరల్ హితేష్ భల్లా గురువారం ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఛత్రపతి శివాజీ ఔన్నత్యం నిరంతరం స్ఫూర్తిదాయకమని లేహ్‌లోని 14 కోర్ ఎక్స్ పోస్ట్‌లో తెలిపింది. ధైర్యసాహసాలు, ముందుచూపు, చెక్కు చెదరని న్యాయాలకు ప్రతీక శివాజీ అని కొనియాడింది. ఇదిలా వుండగా, ఇటీవల చిట్టచివరి ఘర్షణ ప్రాంతాలైన దెమ్‌చోక్, డెప్సాంగ్‌ల నుంచి భారత్, చైనా తమ సైన్యాలను ఉపసంహరించాయి. దీంతో దాదాపు నాలుగున్నరేళ్ల నుంచి ఇరు దేశాల మధ్య ఏర్పడిన ఘర్షణ వాతావరణానికి తెర పడింది.

## స్కామ్‌లతో దిగజారిన కాంగ్రెస్ ప్రతిష్ఠ

- ముడా, వాల్మీకి కుంభకోణాలతో హస్తం పార్టీకి ఇబ్బందులు
- లైంగిక దాడి కేసుల్లో ఇరుక్కొన్న ఇద్దరు విపక్ష నేతలు
- కర్ణాటక రాజకీయాలను కుదిపేసిన 2024 సంవత్సరం



బెంగళూరు, డిసెంబర్ 28: కర్ణాటక రాజకీయాలను 2024 సంవత్సరం కుదిపేసింది! ఈ ఏడాది భారీ కుంభకోణాలు వెలుగుచూడటంతో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠ పూర్తిగా దిగజారింది. ముఖ్యంగా వాల్మీకి, ముడా కుంభకోణాల్లో అధికార పార్టీ ప్రమేయం స్పష్టంగా వెల్లడైంది. సాక్షాత్తూ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆయన భార్యకు ముడా భూముల కుంభకోణంలో పాత్ర ఉందని నిర్ధారణ కావడంతో ఆయనపై కేసు నమోదై, విచారణను ఎదుర్కొంటున్నారు. ఇక విపక్ష బీజేపీ నేత, మాజీ సీఎం యెడియూరప్పపై పోక్సో కేసు నమోదు కావడంతో పాటు ఆయనపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యింది. తన మైనర్ కుమార్తెపై యెడియూరప్ప లైంగిక దాడి చేశారని ఒక మహిళ ఆయనపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. మరో విపక్ష నేత, జేడీఎస్ మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై లైంగిక వేధింపుల ఆరోపణలు తీవ్ర సంచలనం సృష్టించాయి. ఇక రాష్ట్రంలో శాంతి భద్రతల విషయానికి వస్తే మార్చి 1న రామేశ్వరం కేఫ్‌లో జరిగిన బాంబు పేలుడు రాష్ట్రాన్ని కుదిపేసింది. రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు కాంగ్రెస్ సర్కార్ తీవ్ర అస్థిరత మధ్య పాలన కొనసాగించిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. సీఎం పదవికి ఎవరు ఎసరు పెడతారోనని తెలియని అనిశ్చితి పరిస్థితుల్లో సీఎం సిద్ధరామయ్య క్షణమొక యుగంలా పాలన కొనసాగిస్తున్నారు.

## టీ బ్యాగ్‌లతో శరీరంలోకి మైక్రో ప్లాస్టిక్‌లు

బార్సిలోనా: టీ బ్యాగ్‌లతో టీ తాగడం చాలా సౌకర్యంగా, రుచికరంగా ఉంటుంది. అయితే, వీటి వల్ల లక్షల సంఖ్యలో మైక్రో, నానోప్లాస్టిక్స్ శరీరంలోకి వెళ్తున్నట్టు స్పెయిన్ పరిశోధకుల అధ్యయనంలో తేలింది. అటానమస్ యూనివర్సిటీ ఆఫ్ బార్సిలోనాకు చెందిన పరిశోధకులు నైలాన్-6, పాలిప్రోపిలీన్, సెల్యూలోస్ అనే పాలిమర్ల నుంచి చేసిన టీ బ్యాగులపై అధ్యయనం జరపగా వీటితో టీ కలుపుకునేటప్పుడు పెద సంఖ్యలో మైక్రో, నానోప్లాస్టిక్స్ విడుదలవుతున్నట్టు గుర్తించారు. టీ కలిపేటప్పుడు నైలాన్-6 మిల్లీలీటర్‌కు 81.8 లక్షల కణాలను, పాలిప్రోపిలీన్ 120 కోట్ల కణాలను, సెల్యూలోస్ 13.5 కోట్ల కణాలను విడుదల చేస్తున్నట్టు చెప్పారు.

## ట్రంప్ టీమ్‌లో 'వలస' చిచ్చు

- ఇమిగ్రేషన్ విధానంపై రెండు వర్గాలుగా చీలిక
- ప్రతిభ ఆధారిత వలస విధానానికి ఎలాన్ మస్క్, శ్రీరామ్ కృష్ణన్, వివేక్ రామస్వామి మద్దతు
- వారి ముగ్గురిపై ట్రంప్ మద్దతుదారుల విమర్శలు



వాషింగ్టన్, డిసెంబర్ 28: అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శిబిరంలో చిచ్చు రేగింది. వలస విధానాలపై ఆయన అనుచరులు రెండుగా చీలారు. ప్రతిభ ఆధారిత వలస విధానానికి ఒక వర్గం మద్దతు ఇవ్వగా, కఠినమైన వలస విధానాలను అమలు చేయాలని మరో వర్గం వాదిస్తున్నది. కృత్రిమ మేధపై వైట్‌హౌస్ సీనియర్ పాలసీ అడ్వైజర్‌గా భారత సంతతికి చెందిన శ్రీరామ్ కృష్ణన్‌ను నియమించిన నాటి నుంచి ఈ వివాదం మొదలయ్యింది. ఇతర దేశాల నిపుణులకు ఇచ్చే గ్రీన్‌కార్డులపై పరిమితులు తొలగిస్తే బాగుంటుందని శ్రీరామ్ కృష్ణన్ అభిప్రాయపడటం వివాదానికి ఆజ్యం పోసింది.

**వారిని పార్టీ నుంచి తొలగించండి: మస్క్**

ట్రంప్‌కు కీలక మద్దతుదారుగా ఉన్న ఎలాన్ మస్క్ సైతం ప్రతిభ గల ఇతర దేశాల నిపుణులకు అమెరికా వీసాలు దక్కాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మస్క్ అభిప్రాయానికి ట్రంప్ శిబిరంలోని భారత సంతతి వ్యక్తి వివేక్ రామస్వామి మద్దతు ఇచ్చారు. వీరిపై పలువురు రిపబ్లికన్ పార్టీ మద్దతుదారులు విమర్శలు గుప్పించారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన మస్క్.. ద్వేషపూరిత, జాత్యాంహంకారం కలిగిన మూర్ఖులను పార్టీ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

## పాక్‌పై తాలిబన్ల దాడులు

ఇస్లామాబాద్: ఆఫ్ఘనిస్థాన్ తాలిబన్ ప్రభుత్వ దళాలు శనివారం పాక్ సరిహద్దు ప్రాంతంలోని కుర్రమ్‌పై దాడులు చేశాయి. పాక్ ప్రతిస్పందిస్తూ దాడులు చేసింది. ఈ దాడుల్లో ముగ్గురు ఆఫ్ఘన్ సైనికులు, ఓ పాకిస్థానీ సైనికుడు మరణించారు. తొమ్మిది మంది పాకిస్థానీలు గాయపడ్డారు. దండే పటన్-కుర్రమ్ సరిహద్దు ప్రాంతంలో ఈ దాడులు కొనసాగుతున్నాయి. మరోవైపు పక్తియా సరిహద్దు ప్రాంతంలోనూ దాడులు జరుగుతున్నాయి. . దాడుల కారణంగా ఆఫ్ఘన్‌లోని ఖోస్ట్ పట్టణవాసులు తమ ఇండ్లను వదిలి వెళ్లిపోతున్నారు. పాకిస్థాన్ 24న అఫ్ఘన్‌పై దాడి చేసిన తర్వాత ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు చెలరేగాయి.